నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I | హైదరాబాద్, శుక్రవారం 28 మార్చి 2025 | RANGAREDDY

## కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నిస్తునందుకే అక్రమ కేసులు



వికారాబాద్, మార్చి 27 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం దుర్మార్గమని.. ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా ఆ కేసు నమోదు చేయించిందని మండిపడ్డారు. ప్రభుత్వంపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను తట్టుకోలేకే డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన అంటే అక్రమ కేసులు పెట్టి.. అక్రమంగా అరెస్టులు చేయడమేనా అని ప్రశ్నించారు. టెన్త్ క్లాస్ ప్రశ్నపత్ర లీకేజీ బండారాన్ని బయటపెట్టినందుకు కేటీఆర్‌పై అట్రాసిటీ కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన ఏమైనా కులం పేరు పెట్టి నిందించాడా? అసలు నిందితులు ఏ కులానికి చెందిన వారో కూడా తెలియదన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వికారాబాద్ జిల్లా తరఫున ఆయన డిమాండ్ చేశారు.



నందిగామ ఠాణాలో ఉన్న నందిగామ మాజీ సర్పంచ్‌లు

## మాజీ సర్పంచ్‌ల అరెస్టు అక్రమం

### సర్పంచ్‌ల సంఘం రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నందిగామ, మార్చి 27 : గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లు చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయకుండా రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ..మాజీ సర్పంచ్‌ల అరెస్టు అక్రమని సర్పంచ్‌ల సంఘం రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు గురువారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా నందిగామ మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరిన మాజీ సర్పంచ్‌లను ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయించడం దారుణమని మండిపడ్డారు. అరెస్టైన వారిలో చేగూరు మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, సర్పంచ్‌లు గోవింద అశోక్, జట్ట కుమార్, నర్సింహ, బండి రాజు తదితరులు ఉన్నారు.

## మొరాయిస్తున్న సర్వర్

### అవస్థల్లో ప్లాట్ల యజమానులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 27 : అనుమతి లేని లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం 25 శాతం రాయితీపై ఎల్ఆర్ఎస్ రుసుం స్వీకరిస్తుండగా.. ప్లాట్ల యజమానులను సర్వర్ కష్టాలు వెంటాడుతున్నాయి. 2021లో మున్సిపాలిటీ పరిధిలోని దాదాపు 48,000 మంది ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో వివిధ కారణాలతో దాదాపు 13,000 ప్లాట్లు నిషేధిత జాబితాలో చేరగా.. మిగతా దాదాపు 35,000 ప్లాట్లు ఉన్నాయి. ఎల్ఆర్ఎస్ రుసుం స్వీకరణకు పెద్దఅంబర్‌పేటలోని మున్సిపల్ కార్యాలయంలో స్పెషల్ డెస్క్‌ను ఏర్పాటుచేశారు. రుసుం చెల్లించేందుకు, దరఖాస్తుల విచారణ కోసం నిత్యం వందల మంది కార్యాలయానికి వస్తున్నారు. సర్వర్‌లో తలెత్తుతున్న సమస్యలతో ప్లాట్ల యజమానులు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. రుసుం వివరాలు, చెల్లించాల్సిన మొత్తాలు, ఇతర సందేహాలను తీర్చేందుకు సిబ్బంది ఉన్నా.. సర్వర్ పదేపదే డౌన్ అవుతుండడంతో యజమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులు

## పరీక్షా కేంద్రాల పాఠశాలల్లో త్వరగా మధ్యాహ్న భోజనం

### భోజనం తయారీ సిబ్బందికి అధికారుల అనుమతి

నమస్తే ఎఫెక్ట్

పరిగి, మార్చి 27 : టెన్త్ పరీక్షా కేంద్రాలు కొనసాగుతున్న పాఠశాలల్లో 'మధ్యాహ్న భోజనానికి పడిగాపులు' అన్న శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. టెన్త్ పరీ క్షా కేంద్రాలుగా కొనసాగుతున్న పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సిబ్బందిని ఒంటిగంట వరకు లోపలికి అనుమతించకపోవడంతో ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల తర్వాతే భోజనం విద్యార్థులకు అందుతుందని ఆ కథనంలో పేర్కొనడం జరిగింది. కాగా, సంబంధిత పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 12.40 గంటలకు విద్యార్థులతోపాటు.. పరీక్షలకు హాజరైన స్టూడెంట్స్‌కూ భోజనాన్ని అందించాలని.. భోజనాన్ని తయారు చేసే సిబ్బందికి పరీక్షల కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు గుర్తింపు కార్డులు జారీ చేసి వారిని పాఠశాలలకు అనుమతించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## పల్లెప్రకృతి వనంలోని మొక్కలకు నీళ్లు..

దోమ : మండలంలోని మల్లేపల్లి గ్రామ పంచాయతీలోని పల్లెప్రకృతి వనంలో ఉన్న మొక్కలు ఎండిపోతున్నాయని 'ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం' అన్న శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మల్లేపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పంచాయతీ సిబ్బందితో కలిసి పల్లెప్రకృతివనంలోని మొక్కలకు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందించారు.

మొక్కలకు నీటిని అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి





మంచాల మండలంలోని రంగాపూర్‌లో ఎండిపోయి బీటలు వారిన వరి చేను

# ఎక్కడ చూసినా..

# ఎండిన పంటలే

## రంగారెడ్డి జిల్లాలో తగ్గుతున్న భూగర్భ జలాలు

- 500ఫీట్లకు పైగా బోర్లు వేసినా రాని చుక్క నీరు
- కన్నెత్తి చూడని అధికారులు, ప్రజాప్రతినిధులు

**ఆందోళనలో అన్నదాతలు**



ఇబ్రహీంపట్నం : దండుమైలారం గ్రామంలో ఎండిపోయిన వరి పంటను మేస్తున్న మేకలు

రంగారెడ్డి జిల్లాలోభూగర్భజలాలు తగ్గుతున్నాయి. బోరు బావుల్లో నీళ్లు అడుగంటుతుండడంతో పొలాలు నెర్రెలు తేలి బీటలు వారుతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు చేయని ప్రయత్నాలు లేవు. అప్పులు చేసి కొత్తగా బోర్లను 500 ఫీట్లకు పైగానే తవ్విస్తున్నా చుక్క నీరు రావడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించి పంట చేతికొచ్చే దశలో కండ్ల ముందే ఎండిపోతుండడంతో అన్నదాత కండ్లలో నీరు ఆగడం లేదు. దీంతో చేసేదేమీలేక ఆ పంటను పశువులు, గొర్రెలు, మేకలకు మేతగా వేస్తున్నారు. కాగా, కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదని.. పుష్కలంగా ఉన్న నీరుతో రెండు సీజన్లలో పంటలను సాగు చేసుకుని సంతోషంగా జీవించామని అన్నదాతలు పేర్కొం టున్నారు. సకాలంలో రైతుబంధు పెట్టుబడి సాయం రావడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితే తమకు ఎదురు కాలేదని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ సర్కార్ వస్తూ.. కరువును తీసుకొచ్చిందని.. ప్రభుత్వం జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

**-మంచాల/ఇబ్రహీంపట్నం, మార్చి 27**



ఎండుముఖం పట్టిన రైతు చిట్టె పాపయ్య వరిపంట



### పంట సాగుకోసం చేసిన అప్పే మిగిలింది..

నాకు ఉన్న నాలుగెకరాల పొలంలో వరి పంటను సాగు చేశా. ఇందుకు ఓ వ్యాపారి వద్ద రూ. నాలుగు లక్షలను అప్పుగా తీసుకొచ్చా. ఏడు రోజుల వరకు పైపు నిండా బోరు నీళ్లు పోసింది. ఇంకో 20-25 రోజులైతే ఆ పంటను కోసి వడ్లను అమ్మి వ్యాపారికి అప్పు చెల్లిద్దామని అనుకున్నా.. కానీ, ఇంతలోనే బోరు వట్టిపోయింది.ఇప్పుడు ఆ అప్పును ఎలా చెల్లించాలో అర్థం కావడంలేదు. ఇప్పటివరకు ఉన్న అప్పులు, కుటుంబ పోషణ కూడా భారం కానున్నది. వాటిని చెల్లించేందుకు ఉన్న భూమిని అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చింది. పొలంలోని పంటను చూస్తుంటే దుఃఖం ఆగడం లేదు. కాంగ్రెస్ సర్కార్ రూపాయీ ఇవ్వకున్నా అప్పులు తీసుకొచ్చి పంటను సాగు చేస్తే కరువు రక్కసి ఆగమాగం చేసింది. కేసీఆర్ హయాంలోనే బాగుండే. సమృద్ధిగా వానలు కురిసి.. సకాలంలో పంటలను సాగుచేసుకుని సంతోషంగా జీవించాం. కాంగ్రెస్ సర్కార్ వచ్చింది.. కరువును తీసుకొచ్చింది.

**-చిట్టె పాపయ్య, దండుమైలారం గ్రామం, ఇబ్రహీంపట్నం**



### రైతుగోస ఎవరికీ పట్టడం లేదు..

అన్నయ్య, నేను కలిసి నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాం. ఇందుకు రూ.1,00,000 వరకు ఖర్చు పెట్టాం. ఉన్న మూడు బోర్లు నీళ్లు లేక ఎండిపోయాయి. పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీటిని అందించినా సరిపోవడం లేదు. పంటలు ఎండిపోతున్నా పోవడం లేదు. రైతు గోస పాలకులకు పట్టడం లేదు. పాలమా బాధలు తెలుసుకునేందుకు ఏ ఒక్క అధికారి కూడా రావడం లేదు. పాలకులారా..? రైతు గోసను పట్టించుకోండి. ఇప్పుడు తీసుకొచ్చిన అప్పులను తీర్చే మార్గమే కనిపించడంలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**-బాల్‌రాజ్(బండలేమూరు)**



మంచాల : కొర్రవాని తండాలో ఎండిన వరి చేనును చూపిస్తున్న రైతు సీతారాం

### కన్నీళ్లు ఆగడం లేదు..

నాకు ఎకరం పొలం ఉన్నది. దానినే నమ్ముకుని బతుకుతున్నా. రూ.30,000 వరకు అప్పు చేసి వరి పంటను సాగు చేశా. ఉన్న బోరు నుంచి నీటి సరఫరా తగ్గి.. ఆ పంట పూర్తిగా ఎండిపోయింది. ఆ పంటను చూస్తుంటే కన్నీళ్లు ఆగడం లేదు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదు. గతంలో సమృద్ధిగా ఉన్న నీటితో రెండు సీజన్లలో పంటలు పండించుకుని జీవించా. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరువు వచ్చింది. చెరువులు, కుంటలు ఎండాయి. బోర్లలోనూ నీళ్లు పాతాళానికి చేరాయి.

**-సీతారాంనాయక్, ఆంబోత్‌తండా**



మంచాల : రంగాపూర్‌లో పంటను కాపాడుకునేందుకు బోరు వేయిస్తున్న రైతు


# కరెంట్ కట్ చేస్తామంటూ..ఖాతా ఖాళీ

- విద్యుత్తు వినియోగదారులకు మెసేజ్‌లతో కూడిన లింక్‌లు
- క్లిక్ చేస్తే.. డేటా హ్యాక్.. క్షణాల్లో ఖాతా ఖాళీ ..
- సైబర్‌నేరస్తుల సరికొత్త మోసం
- మోసపూరిత సందేశాలను నమ్మొద్దు : టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): సరికొత్తగా కరెంట్ బిల్లు పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. కరెంట్ బిల్లు పెండింగ్‌లో ఉన్నదని, సాయంత్రంలోగా బిల్లు చెల్లించకపోతే విద్యుత్తు కనెక్షన్ కట్ అవుతుందంటూ మెసేజ్ ఉన్న లింక్ వెంటనే ఓపెన్ చేసి బిల్లు చెల్లించాలంటూ పంపుతున్నారు. హైదరాబాద్‌లో చాలామందికి ఈ తరహా మెసేజ్‌లు వస్తున్నాయి. కరెంట్ బిల్లు కట్టిన వారికి కూడా ఇలాంటి మెసేజ్‌లు రావడంతో అనుమానం వచ్చి సైబర్ క్రైమ్ పోలీసులకు కొందరు ఫిర్యాదు చేశారు.

### క్షణాల్లో డబ్బులు మాయం..

లింక్ ఓపెన్ చేయగానే వారి ఫోన్ నంబర్‌కు లింక్ అయిన బ్యాంక్ అకౌంట్స్‌కు సంబంధించిన డేటా హ్యాక్ చేస్తున్నారు. క్షణాల్లోనే ఖాతాల్లోంచి డబ్బు మాయమవుతున్నది. మహారాష్ట్ర, బీహార్ నుంచి కరెంట్ బిల్లు పెండింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. 8967954941 నంబర్ నుంచి వినియోగదారులకు మెసేజ్‌లు వస్తున్నాయని, ఈ నంబర్ నుంచి వచ్చిన లింక్‌లను ఓపెన్ చేయొద్దంటూ పోలీసులు సూచిస్తున్నారు. వెంటనే 8135967194 కాల్ చేయాలని, వాట్సాప్ మెసేజ్ చేయమని వచ్చినా.. స్పందించవద్దని పేర్కొంటున్నారు. ట్రూ కాలర్‌లో చెక్ చేస్తే ఈ నంబర్ ఎలక్ట్రిసిటీ పవర్‌ఆఫీస్, కరెంట్ ఆఫీస్ అసోం చిరునామాతో ఉన్నటు తెలుస్తున్నది.




వినియోగదారుల ట్రూకాలర్, వాట్సాప్‌లకు సైబర్ నేరగాళ్లు పంపించిన మెసేజ్ లింక్‌లు

### మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దు

విద్యుత్తు బకాయిలు, బిల్లుల పేరుతో కొంత మంది వ్యక్తులు తమ వినియోగదారులను ఫేక్ మెసేజ్‌లు పెట్టి మోసం చేస్తున్నారు. అటువంటి మెసేజ్‌లను వినియోగదారులు నమ్మి మోసపోవద్దు. సంస్థ పంపే మెసేజ్‌లలో విభాగం పేరు, యూఎస్‌సీ/సర్వీస్ నంబర్, వినియోగదారుడి పేరు, బిల్లులు ఉంటాయి. అలాగే, సంస్థ ఎప్పుడు కూడా మొబైల్ నంబర్ నుం చి సందేశాలను పంపించదని.. సంస్థ ఉద్యోగులు వినియోగదారుల నుంచి చెల్లింపు రసీదు తప్ప బ్యాంక్ ఖాతా తదితర వివరాలు సేకరించరని.. సంస్థ బిల్లుల చెల్లింపు కోసం ఎలాంటి లింక్‌లు పంపించదు.

**-టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి**